ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 327 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 5 మార్చి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## రెండురోజులుగా
# ఢిల్లీలోనే సీఎం

### రాష్ట్రానికి రావాల్సిన వాటా, నిధుల కేటాయింపులపై విజ్ఞప్తులు



హైదరాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం): ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన రెండోరోజు కొనసాగింది. కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీతో సీఎం, మంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై కేంద్రమంత్రి చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. 2014-15 సంవత్సరానికి సంబంధించి సేకరించిన ధాన్యం బకాయిలు రూ.1,468.94 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రికి వినతి చేశారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ. 343.27 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎంఆర్ డెలివరి గడువును పొడిగించాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. గత పదేళ్లుగా తెలంగాణలో ఎక్కడా కూడా రేషన్ కార్డు అమలుకాలేదని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు రేషన్ కార్డులను ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే రేషన్ కార్డుల ప్రక్రియను కూడా ముమ్మరం చేశారు. రేషన్ కార్డుల కోటా ..మిగతా 2లో



# ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్

### సెమీస్‌లో ఆస్ట్రేలియాపై గ్రాండ్ విక్టరీ.. 4 వికెట్ల తేడాతో ఘన విజయం
### అర్ధ శతకంతో రాణించిన కోహ్లి.. ఆసీస్‌ను కంగారెత్తించిన భారత బౌలర్లు

ఛాంపియన్స్ ట్రోఫీ తొలి సెమీఫైనల్లో టీమిండియా ఆస్ట్రేలియాపై 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఆదివారం జరగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫైనల్‌కు చేరుకుంది. 265 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత జట్టు 48 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. విరాట్ కోహ్లీ 84 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆడమ్ జంపా బౌలింగ్‌లో బెన్ ద్వార్షిస్‌కు క్యాచ్ ఇచ్చాడు. విరాట్ కాకుండా అక్షర్ పటేల్ 27, శ్రేయాస్ అయ్యర్ 45, కెప్టెన్ రోహిత్ శర్మ 28 పరుగులు చేయగా, శుభ్మాన్ గిల్ 8 పరుగులు చేసి ఔటయ్యాడు. అక్షర్ ను నాథన్ ఎల్లిస్ బౌలింగ్ లో బౌల్డ్ చేయగా, శ్రేయాస్ ను ఆడమ్ జంపా బౌలింగ్ లో బౌల్డ్ చేశాడు. కొన్నోలీ బౌలింగ్‌లో రోహిత్ కూపర్ ఎల్బీగా వెనుదిరిగాడు. అంతకుముందు ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా టాస్ గెలిచి బ్యాటింగ్ ..మిగతా 2లో

## పులిపిల్లలతో సరదాగా గడిపిన ప్రధాని

### పాలుపట్టి వాటితో ప్రేమ ప్రకటించిన మోడీ
### వంతారాలో పర్యటించి వివరాలు తెలుసుకున్న ప్రధాని



2



## అంతర్జాతీయ మహిళా దినోత్సవ కానుక

### మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ అద్దె బస్సులు
### జీవో జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

2

## స్పీకర్‌కు హరీశ్‌రావు లేఖ



హైదరాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం): రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ రాశారు. నక్షత్రం గుర్తు లేని ప్రశ్నలకు ఇప్పటి వరకు ఎందుకు సమాధానాలు ఇవ్వలేదని స్పీకర్‌ను హరీశ్‌రావు ప్రశ్నించారు. నక్షత్రం గుర్తు లేని ప్రశ్నలకు అసెంబ్లీ బిజినెస్ రూల్స్ 52(10) ప్రకారం.. రాతపూర్వ సమాధానాలు టేబుల్‌పై ఉంచాలని గుర్తు చేశారు. గత అసెంబ్లీలో అడిగిన ప్రశ్నలకు ఇప్పటి వరకు సమాధానం రాలేదని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్ర నియోజకవర్గ ప్రయోజనాల కోసం సభలో ప్రశ్నలు అడగడం, సకాలంలో సమాధానాలు పొందడం సభ్యుల హక్కు అని ఆయన స్పష్టం చేశారు. తాము అడిగిన ప్రశ్నలకు వెంటనే సమాధానం ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని స్పీకర్‌ను హరీశ్‌రావు కోరారు.

## మామునూరు వద్ద
# తీవ్ర ఉదిక్తత

### భారీగా తరలివచ్చిన రైతులు
### మహిళలతో కలిసి ఆందోళన
### భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని డిమాండ్

2



# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు



### కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన బోర్డు
### మొత్తం 1,532 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
### సిసి కెమరాలతో కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ
### నిముషం నిబంధన ఎత్తివేత..
### 5 నిముషాల వరకు అనుమతి

హైదరాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం): తెలంగాణలో ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొదటి, ద్వితీయ సంవత్సరం కలిపి దాదాపు పది లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో అబ్బాయిలు 4,97,528 మంది ఉండగా.. అమ్మాయిలు 4,99,443 మంది ఉన్నారు. మొత్తం 1,532 కేంద్రాల్లో జరగనున్న పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు ఇంటర్ బోర్డ్ ప్రకటించింది. ఈసారి పరీక్షా కేంద్రాల గుర్తింపు కోసం హాల్ టిక్కెట్లపై క్యూఆర్ కోడ్‌లను సైతం ముద్రించటం విశేషం. ఇక పేపర్ లీకేజీ, మాస్ కాపీయింగ్ వంటి సమస్యలు తలెత్తకుండా సీసీ కెమెరా సర్వైలెన్స్, పెద్ద సంఖ్యలో స్క్వాడ్ లను సైతం ఏర్పాటు చేశామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య వివరించారు. ఇంటర్మీడియట్ పరీక్షల ..మిగతా 2లో



## పటాన్‌చెరు కాంగ్రెస్‌లో
# గుడెం వర్సెస్ కాటా

### మీనాక్షి నటరాజన్ సీరియస్!

హైదరాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం): తెలంగాణలో అధికార కాంగ్రెస్ లో గత కొంత కాలంగా హీట్ పుట్టిస్తున్న పటాన్ చెరు కాంగ్రెస్ పంచాయతీ ఎపిసోడ్ నూతన ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ వద్దకు చేరింది. గాంధీ భవన్‌లో జరిగిన మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంపై సమీక్ష సందర్భంగా పటాన్ చెరు ఎమ్మెల్యే ..మిగతా 2లో




# ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్

మొదటి పేజీ తరువాయి...

ఎంచుకుంది. ఆ జట్టు 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ 96 బంతుల్లో 73 పరుగులు చేశాడు. అలెక్స్ కారీ 61 పరుగులు, ట్రావిస్ హెడ్ 39 పరుగులు చేశారు. భారత్ తరఫున మహ్మద్ షమీ 3 వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా, వరుణ్ చక్రవర్తి చెరో 2-2 వికెట్లు పడగొట్టారు. మ్యాచ్ లో టీమిండియా బౌలర్లు అదరగొట్టారు. ఒక దశలో 300 పరుగులు చేసేలా కనిపించిన ఆసీస్ కు చివరి ఓవర్లలో కళ్లెం వేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ (96 బంతుల్లో 73బీ 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ గా నిలిచాడు. అలెక్స్ క్యారీ (57 బంతుల్లో 61బీ 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో రాణించాడు. ట్రావిస్ హెడ్ (39) దూకుడుగా ఇన్నింగ్స్ ను ఆరంభించినా వరుణ్ చక్రవర్తికి బలయ్యాడు. భారత బౌలర్లలో మొహమ్మద్ షమీ 3 వికెట్లు తీశాడు. వరుణ్ చక్రవర్తి, రవీంద్ర జడేజాలకు చెరో రెండు వికెట్లు లభించాయి. బ్యాటింగ్ కు దిగిన ఆస్ట్రేలియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. మ్యాథ్యూ షార్ట్ స్థానంలో జట్టులోకి వచ్చిన కూపర్ (0) డకౌట్ అయ్యాడు. అయితే ఆ ఆనందం భారత బౌలర్లకు ఎంతో సేపు నిలవలేదు. హెడ్ హిట్టింగ్ మొదలు పెట్టాడు. ఎడాపెడా బౌండరీలు బాదాడు. దాంతో ఆసీస్ ఓవర్ కు 6 పరుగుల చొప్పున రన్ రేట్ ను మెయింటేన్ చేస్తూ ముందుకు సాగింది. అయితే వరుణ్ చక్రవర్తి డేంజరస్ హెడ్ ను అవుట్ చేశాడు. అనంతరం మార్నస్ లబుషేన్ (29)తో కలిసి స్మిత్ జట్టును ముందుకు నడిపాడు. వీరిద్దరు నెమ్మదిగా ఆడారు. అయితే కీలక సమయంలో లబుషేన్ అవుటయ్యాడు. ఆ వెంటనే ఇంగ్లిస్ (11) కూడా పెవిలియన్ కు చేరాడు. ఈ దశలో స్మిత్, అలెక్స్ క్యారీలు జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు సమయోచితంగా ఆడారు. 30 ఓవర్లు దాటాకా వీరిద్దరు హిట్టింగ్ చేశారు. ఫలితంగా ఆస్ట్రేలియా 300 పరుగులు చేసేలా కనిపించింది. అయితే స్మిత్ ను షమీ అవుట్ చేశాడు. ఆ వెంటనే సిక్సర్ కొట్టి ఊపుమీద కనిపించిన మ్యాక్స్ వెల్ (7)ను అక్షర్ పటేల్ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఇక చివర్లో అలెక్స్ క్యారీ అవుటవ్వడంతో ఆస్ట్రేలియా 264 పరుగులకు పరిమితం అయ్యింది.

## మామునూరు వద్ద
# తీవ్ర ఉద్రిక్తత

హైదరాబాద్,మార్చి4(ఆర్ఎన్ఎ): మామునూరు ఎయిర్‌పోర్టు సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని అన్నదాతలు మంగళవారం ఉదయం నిరసనకు దిగారు. నక్కలపల్లి రోడ్డు తీసేయవద్దని డిమాండ్ చేశారు. తమకు రోడ్డు మార్గం చూపాలని ఆందోళనకు దిగారు రైతులు. ఆందోళనలో భారీగా మహిళలు పాల్గొన్నారు. సమాచారం అందిన వెంటనే మామూనూరు ఎయిర్‌పోర్టు వద్దకు భారీగా పోలీసులు మోహరించారు. మామునూరు ఎయిర్‌పోర్టు రావడం సంతోషకరమే అయినా భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మాములూరుకు సమీపంలో ఉన్న గవిచర్ల క్రాస్ రోడ్డు మీదుగా నక్కలపల్లి, గుంటూరుపల్లి, నెక్కొండ వెళ్లే ప్రధాన రహదారి మొత్తం ఎయిర్‌పోర్టులో కలిసిపోతుంది. రహదారి మూసివేస్తుండటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నక్కలపల్లి ప్రధాన రహదారిపై రైతులు ఆందోళనకు దిగారు. ఎయిర్‌పోర్టును తామేమి వ్యతిరేకించడం లేదని రైతులు చెబుతున్నారు. ఇక్కడ విమానాశ్రయం రావడం సంతోషకరమన్నారు. ఎయిర్‌పోర్టు రావడం వల్ల ఎంతైతే లాభపడుతున్నామో.. అంతకంటే ఎక్కువ నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన రాకపోవడంతో ధర్నాకు దిగినట్లు వారు తెలిపారు. మార్కెట్ వాల్యూ ప్రకారమే రేట్ ఇస్తామని లేదా రైతులు కోరుకున్న చోటే వ్యవసాయ ఆమోద యోగ్యమైన భూములు ఇస్తామని మంత్రి సురేఖ చెప్పారని అన్నారు. నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని కూడా మాట ఇచ్చినట్లు తెలిపారు. కానీ ఇప్పుడు భూములకు భూమి ఇవ్వకపోవడమే కాకుండా.. తమ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గాన్ని కూడా మూసి వేస్తున్నారని.. అంతే కాకుండా కొత్తగా రోడ్డు మార్గానికి ప్రభుత్వం ఆసక్తి చూపించడం లేదని అన్నదాతలు వాపోయారు. తమకు కచ్చితంగా న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాగా.. తెలంగాణ రెండవ ఎయిర్‌పోర్టుకు మార్గం సుగమం అయిన నేపథ్యంలో ఇక్కడ భూసేకరణకు అధికార యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం భూసేకరణ సర్వే చేయాలని నిర్ణయించారు అధికారులు. అయితే సర్వేను అడ్డుకునేందుకు రైతులు, మహిళలు పెద్ద ఎత్తున అక్కడకు తరలి వచ్చారు. కాసేపటి క్రితమే ఎయిర్ పోర్ట్ భూసేకరణ సర్వేకోసం హనుమకొండ ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వరరావు అక్కడకు వెళ్లారు. దీంతో అధికారులను రైతులు, మహిళలు నిలదీశారు. తమకు న్యాయం చేయాలని అధికారులను నిర్వాసితులు అడ్డుకున్నారు. రైతుల ఆందోళన నేపథ్యంలో కలెక్టర్‌తో వరంగల్ ఆర్డీవో, తహసీల్దార్ ఫోన్ లో సంప్రదింపులు జరుపారు. ప్రస్తుతం భూసేకరణ సర్వే తాత్కాలికంగా నిలిచిపోయింది.

## పటాన్‌చెరు కాంగ్రెస్‌లో
# గుడెం వర్సెస్ కాటా

మొదటి పేజీ తరువాయి...

గూడెం మహిపాల్ రెడ్డి అంశాన్ని కాటా శ్రీనివాస్ సమావేశంలో ప్రస్తావించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ కోసం తాను పని చేశానని, ఇప్పుడు నేను కష్టకాలంలో ఉంటే ఎవరూ అండగా లేరని కాటా శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహా, జిల్లా ఇన్ చార్జి మంత్రి కొండా సురేఖా, జగ్గారెడ్డి తదితర ముఖ్యనేతలు హాజరైన ఈ సమావేశంలో పటాన్ చెరు పంచాయితీపై నటరాజన్ క్లాస్ తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ నాయకులను కాపాడుకోవాలి కదా అంటూ మీనాక్షి పార్టీ నేతలకు చురకలు అంటిచారు. కాటా శ్రీనివాస్ తో మాట్లాడిన మీనాక్షి.. పార్టీ అన్నీ గమనిస్తోందని, కార్యకర్తలకు అన్యాయం జరగదని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశం ముగిసిన అనంతరం జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహాతో మీనాక్షి నటరాజన్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. పటాన్ చెరులో ఏం జరుగుతోందని వివరణ అడిగారు.

**గూడెం వర్సెస్ కాటా:**

పటాన్ చెరు కాంగ్రెస్ పార్టీలో గత కొంత కాలంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వర్సెస్ కాటా శ్రీనివాస్ గౌడ్ మధ్య రాజకీయం భగ్గుమంటోంది. గత కాంగ్రెస్ తరఫున కాటా శ్రీనివాస్ పోటీ చేసి ఓడిపోగా బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన గూడెం మహిపాల్ రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత గూడెం కాంగ్రెస్ గూటికి చేరారు. అయితే ఎమ్మెల్యే కాంగ్రెస్ లోకి వచ్చాక అసలైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పదవులు, పంపకాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని కాటా వర్గీయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పలు సందర్భాల్లో కాటా శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర నేతల దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే తీరును నిరసిస్తూ ఇటీవల కాటా వర్గీయులు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పై దాడి చేసిన విషయం తీవ్ర దుమారం రేపింది. పార్టీ అధికారంలో లేని సమయంలో పార్టీకి అండగా నిలిచామని ఇప్పుడు అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే పార్టీలోకి వచ్చి అసలైన కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని కాటా వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంలో తాజాగా మీనాక్షి నటరాజన్ ఫోకస్ చేయడం పటాన్ చెరు పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారింది. అందరూ సమన్వయంతో పని చేయాలని అల్టిమేటం జారీ చేయడంతో రాబోయే రోజుల్లో ఈ వ్యవహారం ఎలా ఉండబోతున్నదనేది ఉత్కంఠగా మారింది.

## రెండురోజులుగా
# ఢిల్లీలోనే సీఎం

మొదటి పేజీ తరువాయి...

కింద రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు ధాన్యం, సబ్సీడీని కేంద్రం ఇవ్వాల్సి ఉంటుంది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధాన్యం సేకరణ పెద్ద ఎత్తున జరిగింది. దాదాపు 66.76లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ నేపథ్యంలో ధాన్యం ప్రెక్యూర్‌కు సంబంధించి కేంద్రం తన వాటాను కొనుగోలు చేయాలని, అలాగే పౌరసరఫరాల శాఖకు సంబంధించి గతంలో పెండింగ్‌లో ఉన్న నిధులతో పాటు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన నిధులపై కూడా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ దృష్టికి సీఎం తీసుకెళ్లారు. దేశంలో ధాన్యం సేకరణలో పంజాబ్ మొదటి స్థానంలో ఉండగా, రెండో స్థానంలో హర్యానా, మూడో స్థానంలో తెలంగాణ ఉంది. ఇన్ని లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా.. సన్న బియ్యానికి రూ.500 బోనస్‌ను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. గతంలో కంటే కూడా ఈ ఏడాది ఎక్కువగా ధాన్యం సేకరణ జరిగింది. కాళేశ్వరం నుంచి నీళ్లు ఇవ్వకపోయిప్పటికీ లక్షల హెక్టార్లలో పంటను పండించి రూ.500 సబ్సీడీతో పంటను కొనుగోలు చేసింది. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉగాది నుంచి రేషన్ సరఫరా ద్వారా సన్న బియ్యాన్ని ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రావాల్సిన నిధులను తెలంగాణకు వెంటనే మంజూరు చేయాల్సిందిగా కేంద్రమంత్రిని ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు ఆ శాఖకు సంబంధించిన ఇతర అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సోమవారం తొలిరోజు కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సుదీర్ఘంగా చర్చలు జరిపారు సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్. దాదాపు దాదాపు గంట పాటు వీరి సమావేశం కొనసాగింది. తెలంగాణ రాష్ట్రంలో పలు నీటి ప్రాజెక్టులపై ప్రధానంగా ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పర్యావరణ అనుమతులు, ఇతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మంగళవారం కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీతో భేటీ అయిన సీఎం రేవంత్, ఉత్తమ్.. సాయంత్రం ఢిల్లీ పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు రానున్నారు.

# బీజేపీని నమ్మితే అమ్ముడు ఖాయం

**ఆదిలాబాద్‌లోని సీసీసీని అమ్మేందుకు సిద్ధపడటం దుర్మార్గం**

**నమ్మి ఓట్టేసినందుకు ఇదేనా మీరిచ్చే బహుమతి**

**కార్మికుల ఆవేదన, ఆర్థనాదాలు వినిపించడం లేదా : మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం): బీజేపీని నమ్ముకుంటే చివరకు నడీరోడ్డుపై అమ్మేస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాని తుక్కు కింద తెగనమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సీసీఐని పునఃప్రారంభిస్తామని మాటిచ్చి, ఓట్లు, సీట్లు దండుకుని చివరికి స్క్రాప్ కింద అమ్మేస్తారా అంటూ నిలదీశారు. సీసీఐపైనే కోటి ఆశలు పెట్టుకుని ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసనలు కేంద్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా? వారి ఆర్థనాదాలు వినిపించడం లేదా మండిపడ్డారు. ఎంతో విలువైన యంత్ర పరికరాలను పాత ఇనుప సామాన్ల కింద లెక్కకట్టి ఆన్‌లైన్‌లో టెండర్లు పిలవడం, సీసీఐ సంస్థ గొంతు కోయడమేనన్నారు. నిర్మాణ రంగంలో సిమెంటుకున్న డిమాండ్ దృష్ట్యా సీసీఐని ప్రారంభించి కార్మికులను కాపాడాలని బీఆర్ఎస్ పదుల సార్లు కేంద్రమంత్రులకు మొరపెట్టుకున్నా కనికరించకపోవడం ఆదిలాబాద్‌కు వెన్నుపోటు పొడవడమేనని చెప్పారు. 772 ఎకరాల భూమి, 170 ఎకరాల్లో టౌన్ షిప్, 48 మిలియన్ లైమ్ స్టోన్ నిల్వలతో సకల వనరులున్న సంస్థను అంగడి సరుకుగా మార్చేసిన కేంద్రానికి ఉద్యోగులు, కార్మికుల గోస తగలక మానదన్నారు. ఈ అనాలోచిత నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకునే దాకా కార్మికులతో కలిసి ఉద్యమిస్తాం.. సంస్థ పరిరక్షణ కోసం ఎంతవరకైనా పోరాడతామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రోత్సాహం అందించి వాటిని ఆదుకోవాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అండగా నిలుస్తున్నది. అస్మదీయులకు ప్రభుత్వ సంస్థలను కట్టబెడుతూ ఉద్యోగులను రోడ్డుపాలు చేస్తున్నది. కార్పొరేట్‌కు అప్పగించే పనుల్లో భాగంగా ఆదిలాబాద్ సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని ప్రభుత్వం అమ్మకానికి పెట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు మూతబడిన సీసీఐ యంత్ర సామగ్రిని స్క్రాప్ కింద వేలం వేయడానికి టెండర్లను ఆహ్వానించింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం సిమెంటుకు డిమాండ్ భారీగా ఉంది. ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను ప్రారంభించడానికి అన్ని వనరులు ఉన్నాయి. సీసీఐని ప్రారంభిస్తే 2,500 మందికి ప్రత్యక్షంగా, మరో 2,500 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. సీసీఐని ప్రారంభించాలని గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తి చేసింది. పరిశ్రమ పునఃప్రారంభానికి రాయితీలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే జోగు రామన్నతో పాటు ఇతర బీఆర్ఎస్ నేతలు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండేలను కలిసి అనేకసార్లు వినతిపత్రాలు అందజేశారు. కానీ, మోదీ సర్కారు స్పందించలేదు.

## అంతర్జాతీయ
# మహిళా దినోత్సవ కానుక

హైదరాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం): అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా తెలంగాణ మహిళ సమాఖ్యలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా సంఘాలకు స్వయం ఉపాధిలో భాగంగా ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం అందుకు సంబంధించిన జీవోను రేవంత్ సర్కార్ జారీ చేసింది. తొలి విడతలో 150 మహిళా సమాఖ్యలకు 150 ఆర్టీసీ బస్సులు కేటాయించనున్నారు. ప్రతి నెల ఒక్కో బస్సుకు అద్దె కింద రూ. 77,220 చెల్లించనుంది. ఇక బస్సుల కొనుగోలు కోసం మహిళా సంఘాలకు బ్యాంకు గ్యారంటీ సైతం ప్రభుత్వం ఇవ్వనుంది. దీంతో దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులను నడపనున్నాయి. ఆ రోజు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్ మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్ని.. ఈ బస్సులను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత మిగిలిన మండల సమాఖ్యలకు 450 ఆర్టీసీ అదె బస్సులను కేటాయించనున్నారు. మరోవైపు సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరిట మహాలక్ష్మి పథకాన్ని చేపట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తు?న్నారు. అయితే ఈ పథకం వల్ల రాష్ట్రంలోని మహిళలు.. ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఇక అంతకు ముందు కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఉచిత బస్సు ప్రయాణాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. క్కడ సైతం ఆ పార్టీ అధికారంలోకి రావడంతో.. తెలంగాణలో సైతం తమ పార్టీ అధికారంలోకి వస్తే.. ఈ పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. దీంతో తెలంగాణ ఓటరు సైతం కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. ఆ పార్టీ అధికారంలోకి రావడంతో.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ హామీని అమలు చేస్తోంది. దీంతో మహిళా సంఘాలకు స్వయం ఉపాధిలో భాగంగా ఆర్టీసీ అద్దె బస్సులు కేటాయించడం.. తెలంగాణ మహిళలకు శుభవార్తగా పరిగణించాలి.

# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

మొదటి పేజీ తరువాయి...

నిర్వహణకు బోర్డ్ సర్వం సిద్ధం చేసిందని అన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు.. మార్చి 5వ తేదీ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 6వ తేదీ నుంచి మొదలవనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు ఇంటర్మీడియట్ పరీక్షలకు ఈసారి కూడా ఒక్క నిమిషం ఆలస్యమనే నిబంధనను ఎత్తివేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్ పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు అంటే.. ఉదయం 9.05 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని బోర్డు స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రానికి కాస్త ముందుగా చేరుకుంటే ఒత్తిడి, ఆందోళనకు గురయ్యే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయని బోర్డు అధికారులు విద్యార్థులకు సూచించారు. ఇక నిబంధనల ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల మధ్య.. విద్యార్థులకు ఓఎంఆర్ పత్రాన్ని అందజేస్తారు. వీటిని విద్యార్థులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈసారి ఇంటర్ హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించారు. దీనిని స్కాన్ చేస్తే పరీక్షా కేంద్రం లోకేషన్ సులువుగా తెలుసుకోవచ్చు.ప్రశ్నపత్రంపై సీరియల్ నెంబరు ముద్రిస్తున్నారు. దీంతో ఏ నెంబర్ ఉన్న పేపర్.. ఏ విద్యార్థికి వెళ్తుందో సులువుగా తెలుస్తుంది. ఒకవేళ అది బయటకు వచ్చినా వెంటనే ఏ పరీక్షా కేంద్రం, ఏ విద్యార్థిదనే విషయాన్ని సులభంగా గుర్తించవచ్చు. ఈ పరీక్షల వేళ.. స్మార్ట్ వాచ్‌లతోపాటు అనలాగ్ వాచ్‌లను సైతం నిషేధిస్తున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ సారి పరీక్షల వేళ.. చేతి గడియారాలనూ కూడా అనుమతించడం లేదు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)ని ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోని సీసీ కెమెరాలను ఈ కేంద్రంతో అనుసంధానించారు. మొత్తం 75 మంది సిబ్బంది.. ఈ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించనున్నారు. విద్యార్థుల పరీక్షలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఈ హెల్ప్‌లైన్ నెంబరు 92402 05555 ను సంప్రదించవచ్చునని బోర్డు కార్యాలయం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్‌మీడియట్ పరీక్షలు ప్రారంభమైనాయి. మార్చి 1వ తేదీ నుంచి మొదటి సంవత్సరం, మార్చి 3వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమైనాయి. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు.. హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకొనేందుకు వాట్సప్ నెంబర్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.



## పులిపిల్లలతో సరదాగా
# గడిపిన ప్రధాని

జామ్‌నగర్, మార్చి 4 (ప్రభాత ఉదయం): పులి పిల్లలతో ప్రధాని మోడీ సరదాగా గడిపారు. వాటికి పాలు పట్టి తన ప్రేమను చాటారు. వంతారాలో పునరావాసం పొందుతున్న వివిధ జాతుల జంతువులతో ప్రధాని సన్నిహితంగా మెలిగారు. అక్కడ సింహాల పిల్లలకు , జిరాఫీలకు ఆహారం అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గాయపడిన, ఇబ్బందుల్లో ఉన్న జంతువులను సంరక్షించే లక్ష్యంతో 'వంతారా' కార్యక్రమాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అనంత్ అంబానీ ప్రారంభించారు. వన్యప్రాణుల రక్షణ, పునరావాసం, సంరక్షణ కేంద్రమైన ఈ వంతారాను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం సందర్శించారు. ప్రధాని మోదీ ప్రస్తుతం తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా గిర్ అడవుల్లో సఫారీకి వెళ్లారు. మంగళవారం జామ్‌నగర్‌లోని వంతారాను సందర్శించారు. వన్యప్రాణుల ఆసుపత్రిని, జంతువుల కోసం ఏర్పాటు చేసిన పశువైద్య సౌకర్యాలను వీక్షించారు. అంతే కాకుండా వైల్డ్‌లైఫ్ అనస్థీషియా, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఎండోస్కోపీ, డెంటిస్ట్రీ, ఇంటర్నల్ మెడిసిన్ మొదలైన అనేక విభాగాలను కూడా పరిశీలించారు. దేశ, విదేశాల్లో గాయపడిన, ప్రమాదంలో చిక్కుకున్న జంతువులను కాపాడి, చికిత్స చేసి, సంరక్షించి, పునరావాసం కల్పించడం 'వంతారా' ముఖ్య లక్ష్యం. వంతారా అనేది కృత్రిమ అడవి. గుజరాత్‌లోని జామ్‌నగర్ రిలయన్స్ ర్గి÷నైరీ కాంప్లెక్స్‌లో 3 వేల ఎకరాల్లో ఇది ఉన్నది. ఈ అడవిలో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏనుగుల కోసం ప్రత్యేకంగా దవాఖాన ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్దది. ఇందులో దాదాపు 2వేల వన్యప్రాణులను సంరక్షిస్తున్నారు. వేల సంఖ్యలో ఉద్యోగులు కూడా పనిచేస్తున్నారు.

# కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు

**హైకోర్టులో పిటిషన్ దాఖలు**

హైదరాబాద్, మార్చి 4 (ప్రభాత ఉదయం): భారాస అధినేత, ఎమ్మెల్యే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. విజయ్‌పాల్‌రెడ్డి వేసిన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యంపై కోర్టులో విచారణ జరిగింది. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్.. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలను లేవనెత్తాల్సిన బాధ్యత ఆయనపై ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కొన్ని నెలలుగా ఆయన అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనడం లేదని, ఇలా సమావేశాలకు హాజరు కాకుంటే చట్ట ప్రకారం అనర్హుడిగా ప్రకటించవచ్చన్నారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేయాలని ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. కాగా.. ఈ వ్యాజ్యంలో జోక్యం చేసుకోవడానికి కోర్టు పరిధి ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ పిల్‌కు అర్హత లేదని శాసనసభ వ్యవహారాల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, కోర్టులు జోక్యం చేసుకోవచ్చుని.. ఈ మేరకు వాదనలు వినిపించడానికి గడువు కావాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరడంతో.. విచారణను కోర్టు 2 వారాలకు వాయిదా వేసింది.

# చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు




మిల్లెట్ మార్వెల్ మిక్స్ ను చూపుతున్న స్టాల్ నిర్వాహకులు..




చిరు ధాన్యాల స్టాల్..



మిల్లెట్ ప్రాసెసింగ్ మిషన్..




ప్రదర్శనలో ఏర్పాటు చేసిన ఆయిల్ ను పరిశీలిస్తున్న ప్రజలు

బుద్వేల్, మార్చి4(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ లో జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ చిరుధాన్యాల మేళా, ఇండస్ట్రీ మీట్ మంగళవారం ముగిసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహరాష్ట్ర, ఒడిస్సా రాష్ట్రాలకు చెందిన చిరుధాన్యాలు పండించే రెండు వేల మంది ఎస్సీ ఎస్టీ రైతులు ఈ సమావేశాలలో పాల్గొన్నారు. ఐసీఏఆర్ సంస్థలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, పార్మర్స్ ప్రొడ్యుసింగ్ ఆర్గనైజేషన్స్, వివిధ చిరుధాన్యాల సంస్థలు ఈ సందర్భంగా 80 వరకు సాళ్లు ఏర్పాటు చేశారు.

### చిరుధాన్యాల పొట్టు తీసే స్మాల్ మిల్లెట్ ప్రైమరీ ప్రాసెసింగ్ మెషిన్

మధురై కు చెందిన మోహన్ కుమార్ తయారు చేసిన స్మాల్ మిల్లెట్ ప్రైమరీ ప్రాసెసింగ్ మెషిన్ ద్వారా చిరుధాన్యాల పొట్టు తీయడం సులభంగా ఉంది. రూ.80వేలు విలువ చేసే ఈ యంత్రంలో చిరుధాన్యాలను పోసినట్లయితే గంటకు 50 కిలోల చిరుధాన్యాల పొట్టును తీసి శుభ్ర పరుస్తుంది. ఆ వివరాల కోసం 8667566368 నెంబర్లో సంప్రదించవచ్చు.

చిరుధాన్యాలు పండిస్తున్నారా... ప్రాసెసింగ్, మార్కెటింగ్ సహాయం కావాలా మేమున్నాం . చిరుధాన్యాలకు సంబంధించి ఎలాంటి సహాయం కావాలన్నా, ప్రాసెసింగ్, మార్కెటింగ్, సబ్సిడీలు. రుణాలు కావాలన్నా తామున్నామని మిల్లెట్ మెంటర్, అపూర్వ ఏఐ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. అందుకు గాను ఆ సంస్థకు చెందిన టీమ్ సభ్యురాలు సంజ్యోత్ ఎంతో చక్కగా రైతులకు, యువ పారిశ్రామిక వేత్తలకు తమ సంస్థ గురించి తెలియజేస్తున్నారు. వారి వివరాలకు మిల్లెట్ మెంటర్, అపూర్వ ఏఐ అని సెర్చ్ చేస్తే తెలుస్తుంది.

### టీ, కాఫీలకు బదులు మిల్లెట్ మార్వెల్ మిక్స్ త్రాగండి :

టీ, కాఫీ లకు బదులు 42 రకాల ధాన్యాలు, చిరుధాన్యాలతో తయారు చేసిన మిల్లెట్ మార్వెల్ మిక్స్ త్రాగండి అని రామ్సూర్ సిందునూర్ కు చెందిన ఆ సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. పాలు, నీళ్లలో పౌడర్ కలుపుకుని వేడి చేసి త్రాగితే చాలా మంచిదన్నారు. షుగర్ ఉన్న వారు తీసుకుంటే ఇది మరీ మంచిదని చెబుతున్నారు. ఒకవేళ తియ్యగా ఉండాలంటే మరగబెట్టిన తర్వాత కొంచెం బెల్లం కలుపుకోవచ్చున్నారు. దాని కోసం 9606550984 నెంబర్ సంప్రదిం చవచ్చున్నారు

### ప్రధర్శనలో చిరుధాన్యాల శుద్ధి యంత్రాలు

మైసూర్ కు చెందిన విశ్వ అగ్రిటెక్ సంస్థ నిర్వాహకులు చిరుధాన్యాల ను ప్రాసెసింగ్ చేసే యం త్రాలను ప్రదర్శనలో ఉంచారు. రూ.1.7 లక్షలు విలువ చేసే పాలిషర్, రూ.1.75 లక్షలు విలువ చేసే డి అలార్, డీ స్టోనర్, ఫ్రీ క్లీనింగ్ యంత్రాలు తమ దగ్గర అందుబాటులో ఉన్నాయని వారు చెబుతున్నారు. వాటి గురించి తెలుసుకోవాలంటే ఎప్పుడైన 9844710117 నెంబర్లో సంప్రదిం చవచ్చున్నారు. వీరే కాకుండ బంజారాహిల్స్ కు చెందిన 360 లైఫ్ ఆర్గాన్స్, కూకట్ పల్లి కి చెందిన జస్ట్ మిల్లెట్ లాంటి సంస్థలు చిరుధాన్యాల ఆహార పదార్థాలను స్టాళ్లలలో విక్రయించడానికి, రైతులు తిలకించడానికి ప్రదర్శనలో ఉంచారు.



అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అదికారులు

## ఒళ్లు నొప్పులు తగ్గించడానికి రైస్ బ్రాన్ ఆయిల్‌తో తయారు చేసిన బామ్

బుద్వేల్, మార్చి4(ప్రభాత ఉదయం): బియ్యం తినడానికే కాదు ఒళ్లు నొప్పులు తగ్గించడానికి కూడా ఉపయోగపడతాయని నిరూపించారు రాజేంద్రనగర్ లోని జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) శాస్త్రవేత్తలు. అందుకోసం రైస్ బ్రాన్ ఆయిల్ తో రైస్ రిచే పెయిన్ బామ్ ను తయారు చేశారు. అది రాసుకుంటే ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, తల నొప్పి ఇట్టే మాయమౌతుందని చెబుతున్నారు. రాజేంద్రనగర్ లోని ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు రూపొందిన రైస్ రిచే పెయిన్ బామ్ ను ఉత్పత్తి చేయడం, మార్కెటింగ్ కల్పించడం కోసం మంగళవారం జీడిమెట్లకు చెందిన ఎన్ టు ఏ ఎంటర్ప్రైజెస్ తో ఐఐఆర్ఆర్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ రైస్ రిచే పెయిన్ బామ్ పై ఐఐఆర్ఆర్ కు పేటెంట్ హక్కు కూడా ఉంది. ఐఐఆర్ఆర్ తో పాటు ఎన్ టు ఏ ఎంటర్ప్రైజెస్ సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు అవగాహన ఒప్పందాలపై ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం సమక్షంలో సంతకాలు చేశారు. రైస్ రిచే పెయిన్ బామ్ ను రైస్ బ్రాన్ ఆయిల్, కర్పూరం, మెంతులు ఉపయోగించి తయారు చేయడం జరుగుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.



రెవెన్యూ సిబ్బందితో సమావేశమైన డిప్యూటి కమిషనర్ కె రవికుమార్

## ఆస్తి పన్ను బకాయిలు చెల్లించని వారి ఆస్తులు సీజ్ చేస్తాం

బుద్వేల్, మార్చి4(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ లో ఆస్తి పన్ను చెల్లించని టాప్ డిఫాల్టర్లకు నోటీసులు జారీ చేసి ఆస్తులను సీజ్ చేయాలని డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్ తెలిపారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో రెవెన్యూ విభాగం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఆస్తి పన్ను లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని పన్ను ఎగవేత దారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. టాప్ డిపాల్టర్లకు డిస్ట్రెస్ వారెంట్లు జారీ చేసి వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి వెనుకాడవద్దన్నారు. నివాస భవనాల పేరుతో అనుమతులు తీసుకుని కమర్షియల్ వాణిజ్య కార్యకలాపాలకు ఉపయోగిస్తున్న భవనాల యజమానులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలు తమ ఆస్తి పన్నును ఆన్లైన్ ద్వారా, మీసేవా కేంద్రాలలో, బిల్ కలెక్టర్ల ద్వారా చెల్లించవచ్చున్నారు.




సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

## బీజేపీ సంబరాలు

బుద్వేల్, మార్చి4 (ప్రభాత ఉదయం): ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్ మెదక్ జిల్లాల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాదించిన సం దర్భంగా రాజేంద్రనగర్ లో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పం చిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, నాయకులు బొక్క బాల్ రెడ్డి , గుంజ బాబురావు. ఇ.వేణుగోపాల్, కోరని సదానంద్, కోరని క్రాంతి, పి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## వరి పరిశోధనలలో విప్లవాత్మక మార్పులు: ఇర్రి

### డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అజయ్ కోహ్లి వెల్లడి



శాస్త్రవేత్తల నుద్దేశించి మాట్లాడుతున్న ఇర్రి డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ అజయ్ కోహ్లీ

బుద్వేల్, మార్చి4 (ప్రభాత ఉదయం): రానున్న సంవత్సరాలలో వరి పరిశోధనలో గొప్ప విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేవిదంగా నూతన వరి రకాలను అభివృద్ధి చేయడానికి పరిశోధనలు జరుగుతున్నాయని ఫిలిప్పైన్స్‌ని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఇర్రి) పరిశోధనా విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అజయ్ కోహ్లి వెల్లడించారు. రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మంగళవారం నిర్వహించిన భవిష్యత్తు బాగు కోసం వరి పరిశోధన అనే అంశంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ రూపొందించిన వరి రకాలలో ఆసియా ఖండంలో ఆహార భద్రత సాధ్యం అయ్యిందన్నారు. అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ నుంచి విడుదలైన ఐఆర్-8, ఐఆర్ 64 రకాలు అత్యధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారని, తద్వార భారతదేశంలో వరి దిగుబడి, ఉత్పత్తి గణనీయంగా పెరిగాయన్నారు. ప్రస్తుతం వరి లో వాడుతున్న నత్రజని ని సగానికి సగం తగ్గించి దిగుబడులలో ఏ మాత్రం తేడా రాకుండ పరిశోధనల ద్వారా ఈ నూతన వరి రకాలు అందుబాటులోకి వస్తే వరి లో యూరియా వినియోగం తగ్గడంతో పాటు భూమి నాణ్యత మెరుగు పడి మానవుని ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని పలు సంస్థలను ఆయన సందర్శించారు. అనంతరం వరల్డ్ పుడ్ ప్రైజ్ అవార్డు గ్రహీత డాక్టర్ సమరెందు మహంతి మాట్లాడుతూ, అగ్నేయ, ఆసియా దేశాల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం లో వరి రకాల సాగును ప్రోత్సహించాలన్నారు. తద్వార రైతుల ఆదాయంతో పాటు ఎగుమతులకు కూడా ప్రోత్సాహం లభిస్తుందని ఆయన తెలిపారు. అధునాతన రైస్ మిల్స్ స్థాపించి మిల్లర్లకు తగిన శిక్షణ ఇవ్వడం ద్వారా రైతులకు ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ వరి పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ మీనాక్షీ సుందరం, వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ బలరాం, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, పరిశోధనా విద్యార్థులు పాల్గొన్నారు. ఆ తర్వాత ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ అల్దాస్ జానయ్యతో కలసి డాక్టర్ అజయ్ కోహ్లి, డాక్టర్ సమరెందు మహంతి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందన్ రావు ను సచివాలయంలో కలిశారు.



## నేడు కిస్మత్‌పూర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

బండ్లగూడ, మార్చి 4(ప్రభాత ఉదయం) కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ మల్లేష్ రాజ్ తెలిపారు. రాక్ చర్చ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన శ్రీ సాయి కాలనీ, ప్రభుత్వ పాఠశాల, రాఘవేంద్ర కాలనీ, ఫైన్ ఆర్ట్స్ కాలనీ, ఎన్నారై టౌన్షిప్, రాధా రియాలిటీ, వివేకానంద కాలనీ, యాదాద్రి కాలనీ, ఓం నగర్, ఎస్ ఎం ఎంక్లేవ్ 1,2, సిఎల్ విల్లాస్, కీర్తి విల్లాస్, డిఫెన్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు ఆర్ వి నిర్మాణ్, ట్రంప్ విల్ల, సాయిబాబా కాలనీ, డిఫెన్స్ కాలనీ, రామ్ కి విల్లా, ఖాదర్ ఎన్నారై, ఎల్వి ప్రసాద్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు కే టి టి కాలనీ, శ్రీ బాలాజీ ఎంక్లేవ్, రాజా క్షేత్ర, గిరిదారి, గిరిదారి విష్టా, దర్గా కలిస్తాన్, ఎల్వీ ప్రసాద్, కీర్తి విల్లా స్, నమః, మ్యాప్ ఫర్ కన్స్ట్రక్షన్ 80 యార్డ్స్,, 60 యాడ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఎంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

### షాపూర్ సెక్షన్ లో...

షాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం బుధవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు. మల్కారం, నానాజీ పూర్, రామంజపూర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలో మల్కారం, నానాజీపూర్, రాయన్న గూడ, కవేలిగూడ, బోటి గూడ, రామంజపూర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలి

### రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్



రాజేంద్రనగర్,మార్చి 04(ప్రభాత ఉదయం) ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్ష రాసి మంచి మార్కులు సాధించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు ఇంటర్ విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు. పరీక్ష రాసే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని,ఆనందంగా పరీక్షలు రాయాలని తెలిపారు. ఆందోళన చెందితే చదివిన అంశాలు మార్చిపోతారని,కావున ధైర్యంగా ఉండి చదివిన పాఠాలను మననం చేసుకోవాలన్నారు. ఏదైనా ఒక్క పరీక్ష బాగా రాయకున్నా,మరో పరీక్షకు సన్నద్ధం కావాలని,బాధపడొద్దన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పరీక్షకు వెళ్లే ముందు మంచినీరు,మజ్జిగ,నిమ్మరసం తాగాలన్నారు. నిద్రాహారాలు మాని రాత్రి మొత్తం చదివి అనారోగ్యం పాలుకావొద్దన్నారు. వేళకు తినాలని,వేళకు నిద్రపోవాలన్నారు. సమయానికి ముందే పరీక్షా కేంద్రానికి చేరుకుని రిలాక్స్ గా ఉండాలన్నారు. పేపర్ ఇవ్వగానే ఒక్కసారి మొత్తం చదవాలని,తల్లిదండ్రులు సైతం మార్కుల కోసం ఒత్తిడి చేయకుండా పరీక్షా కాలంలో పిల్లలకు ధైర్యం ఇవ్వాలన్నారు. పౌష్టికాహారం,నీరు,ట్రాన్స్ పోర్ట్ ఇబ్బందులు లేకుండా సమయానికి అందేలా చూడాలన్నారు. పరీక్ష కాలంలో బయటి ఆహార పదార్థాల జోలికి వెళ్లవద్దన్నారు. పరీక్షకు ముందు రోజు పెన్నులు,హాల్ టికెట్,అవసరమైన పరికరాలు సిద్ధం చేసుకోవాలన్నారు. పరీక్ష నియమం ప్రకారం డ్రెస్ కోడ్ పాటించాలని,ఎలక్ట్రానిక్ వస్తువులను హాల్లోకి తీసుకుపోవద్దన్నారు. ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్ష రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు.

## క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

### రాజేంద్రనగర్ ఇంచార్జ్ యువ నాయకుడు పి.కార్తీక్ రెడ్డి..

### యువతకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ బి ఆర్ ఎస్ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి

రాజేంద్రనగర్,మార్చి 04(ప్రభాత ఉదయం) క్రీడలతో మానసిక ఉల్లాసం,శారీరక దారుఢ్యం కలుగుతుందని బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు,రాజేంద్రనగర్ ఇంచార్జ్ యువ నాయకుడు పి.కార్తీక్ రెడ్డి అన్నారు. పీకేఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శంషాబాద్ లో మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ,నోముల రాము యాదవ్,సోమా శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి కార్తీక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులతో కలిసి బ్యాటింగ్ చేస్తూ..కాసేపు వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పి.కార్తీక్ రెడ్డి విన్నర్,రన్నర్ లకు కప్పులను అందజేశారు. ముందుగా కాటేదాన్ 11 కెప్టెన్ సంతోష్ ఫస్ట్ బ్యాటింగ్ చేసి 20 ఓవర్ లలో 179 చేయగా జై హనుమాన్ 11 టీం కెప్టెన్ నోముల సతీష్ 20 ఓవర్లలో 179 చేయగా సూపర్ ఓవర్లలో జై హనుమాన్ 11.6 బంతులలో 17 పరుగులు చేయగా కాటేదాన్ 11.6 బంతుల్లో 6.పరుగులకే పరిమితమై చేతులెత్తేయడంతో ఈ మ్యాచ్ విన్నర్ జై హనుమాన్ 11 టీం కెప్టెన్ నోముల సతీష్ ను విన్నర్ గా ప్రకటించారు. రన్నర్ గా కాటేదాన్ 11 టీం కెప్టెన్ సంతోష్ ప్రకటించడం జరిగిందన్నారు. విజేతగా నోముల సతీష్ ను రన్నర్ గా సంతోష్ ను ప్రకటించి వారికి కప్పులు అందించారు. ఈ సందర్భంగా కార్తిక్ రెడ్డి మాట్లాడుతూ...ఇలాగే యువత అన్ని విభాగాల్లో అన్ని ఆట పోటీల్లో చురుగ్గా పాల్గొని ఆటలే కాకుండా రాజకీయాల్లో కూడా ధైర్యంగా ముందుకు రావాలని, రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలకు,యువతకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు అందుబాటులో ఉండి వారికి అండగా ఉంటానని,ధైర్యంగా బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని యువతను కోరారు. పోటీలు క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తాయని పేర్కొన్నారు. ఆటలు స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగాలని ఆయన కోరారు. యువకులు క్రీడలతో పాటు చదువులో రాణించాలన్నారు. ఆసక్తి ఉన్న ప్రతి క్రీడలో యువత తన నైపుణ్యం ప్రదర్శించాలన్నారు. ఆటలు యువతకు మానసిక ఉల్లాసం ఇస్తుందన్నారు. మ్యాచ్ నిర్వహించిన వారిని అదేవిధంగా జై హనుమాన్ 11 టీంను కాటేదాన్ 11 టీంను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ కెప్టెన్లు శివ పవన్ లతో పాటు అక్కెం రాఘవేంద్ర యాదవ్,మైసిరెడ్డి,గుమ్మడి కుమార్,రాజు,అరుణ్ ముదిరాజ్,సురేష్,వెంకటరమణ,భాస్కర్,మల్లేష్ యాదవ్,రామకృష్ణ,అనిల్,సునీల్,సింహాద్రి క్రికెట్ అభిమానులు,బీఆర్ఎస్ నాయకులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ తారా సత్యవతి..



డ్రోన్‌ల పనితీరు గురించి రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

## రైతుల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యం

### డాక్టర్ తారా సత్యవతి

బుద్వేల్, మార్చి4(ప్రభాత ఉదయం): రైతుల ఆదాయాన్ని పెంచుకోవడానికి చిరుధాన్యాల ప్రాసెసింగ్ గురించి అవగాహన కలిగి ఉండాలని రాజేంద్రనగర్ లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి అన్నారు. రెండు రోజుల పాటు తెలంగాణ, ఆంధ్రప్రతేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిస్సా రాష్ట్రాలకు చెందిన చిరుధాన్యాలు పండించే ఎస్సీ, ఎస్టీ రైతులకు రాజేంద్రనగర్ లో అవగాహన సదస్సులు నిర్వహించారు. చిరుధాన్యాల పంట పొలాలను చూపించి వాటిని పండించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చిరుధాన్యాల పంట ఉత్పత్తుల ప్రాసెసింగ్ విధానాల గురించి శాస్త్రవేత్తల తో అవగాహన కల్పించారు. చిరుధాన్యాల మార్కెటింగ్ గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులు తమకు ప్రాసెసింగ్ మిషన్లు ఉచితంగా అందజేయాలన్నారు. డ్రోన్ల ద్వారా మందుల పిచికారి ఎలా చేయాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ జూ పార్కు డైరెక్టర్ డాక్టర్ సునీల్ హిరేమత్, కర్ణాటక వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ మహేశ్ పాటిల్, ఒడిస్సా అగ్రికల్చరల్ అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం మాజీ డీన్ డాక్టర్ ఎస్ కె స్వైన్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంగప్ప , డాకర్ సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## పీవీఎన్ఆర్ ఎక్స్ప్రెస్ వేపై కారు దగ్ధం



రాజేంద్రనగర్,మార్చి 04 (ప్రభాత ఉదయం) రాజేంద్ర నగర్ పీవీఎన్ఆర్ ఎక్స్ప్రెస్ వేపై కారు దగ్ధమైంది. ఓ డ్రైవర్ మెహదిపట్నం నుంచి శంషాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్తుండగా పిల్లర్ నెంబర్ 211 వద్ద కారులో మంటలు చెలరేగాయి. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వాళ్లు అప్రమత్తమై కారులో ఉన్న డ్రైవర్ ను కాపాడారు. వెంటనే వందకు దయచేసి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. కారు ముందు భాగం పూర్తిగా దగ్ధమైంది. కాగా ఈ ప్రమాదం నుంచి కారు నడుపుతున్న డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.



# నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

### పరీక్షలు రాయనున్న 8,341 మంది విద్యార్థులు

### జిల్లా వ్యాప్తంగా 14 పరీక్షా కేంద్రాలు

### 5 నిమిషాలు ఆలస్యమైన ఎంట్రీ

గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి4(ప్రభాత ఉదయం)నేటి నుంచి(బుధవారం) ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అధికారులు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 5 నుంచి 25వ తేదీ వరకు వార్షిక పరీక్షలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాలను ఏర్పాటు చేయగా, ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి చెందిన 8,341 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 4,057 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 4,284 మంది ఉన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. గంట ముందు నుంచే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించనున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు 5 నిమిషాలు ఆలస్యమైన అనుమతించాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఒక నిమిషం నిబంధన ఎత్తివేయడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

#### ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో, ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశాం. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే ఇంటర్మీడియట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 9160125322 నంబర్ కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.



### మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కూతురు ప్రీతి రెడ్డి.. పెండ్లి కుమార్తె కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి.మాజీ జడ్పి వైస్ చైర్మన్,మాజీ మున్సిపల్ చైర్మన్,మాజీ ఎంపిపి,మాజీ జడ్పిటీసి,మాజీ కౌన్సిలర్లు,

కొత్తకోట, మార్చి 4(ప్రభాత ఉదయం) దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కూతురు వివాహ వేడుక ఈనెల 6న ఉన్నందున.. హైదరాబాద్ లో గల మాజీ ఎమ్మెల్యే ఆలన్న నివాసంలో హల్ది కార్యక్రమంలో భాగంగా పెండ్లి కుమార్తె చేసే కార్యక్రమంలో..మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ,వనపర్తి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్ ,కొత్తకోట మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ పొగాకు సుఖేషిణి విశ్వశ్వర్ ,మాజీ ఎంపిపి గుంత మౌనిక మల్లేష్ ,మాజీ జడ్పిటీసి బాల మణెమ్మ ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బీసం జయమ్మ ,మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు పద్మ అయ్యన్న,చింతల పల్లి సంధ్యా రవీందర్ రెడ్డి,మాజీ ఎంపిటీసి సుమిత్ర వామన్ గౌడ్ ,మాజీ కో అప్షన్ సుజాత అద్వాని శ్రీనివాసులు, బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మి బంగారయ్య ల పాల్గొని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కుమార్తె ప్రీతి రెడ్డికు..పెండ్లి కుమార్తె చేసే కార్యక్రమాన్ని తిలకించి..అక్కడ జరిగిన హల్దీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి అబాకస్ పోటీలలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ విద్యార్థి విజయకేతనం

### అభినందించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



శంషాబాద్. మార్చ్ 4 ప్రభాత ఉదయం: అబాకస్. వేదిక్ మ్యాథ్స్ జాతీయ స్థాయి పోటీలలో శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ లోని సర్దార్ వల్లబ్బాయ్ పటేల్ హై స్కూల్ విద్యార్థి కుక్కల రవి తేజ పాల్గొని తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ విద్యార్థిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మంగళవారం అభినందించారు. విద్యార్థి జాతీయ స్థాయి పోటీ లో విజయం సాధించినందుకు ఆనందం వ్యక్తం చేసారు. కరెస్పాండంట్ డి. సంతోష్ కుమార్ పోటీ గురించి వివరిస్తూ, జాతీయ స్థాయి పోటీకి సుమారు 5000 పాఠశాల ల నుండి 16000 మంది విద్యార్థులు పాల్గొన్నారు అని తెలిపారు.. అందులో సర్దార్ వల్లభభాయ్ పటేల్ హై స్కూల్ విద్యార్థి కుక్కల రవితేజ తృతీయ స్థానం సాధించాడని వివరించారు. వేదిక్ మ్యాథ్స్. అబాకస్ ప్రారంభించిన మొదటి సంవత్సరం లోనే జాతీయ స్థాయి పోటీలో విజయం సాధించడం గర్వకారణంగా ఉన్నదని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ కపిల్ దేవ్ మాట్లాడుతూ విద్యార్థులలో మేధాశక్తిని పెంపొందించడానికి అబాకస్.వేదిక్ మ్యాథ్స్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొద్దం స్వప్న మాట్లాడుతూ రవి తేజ కేవలం 7 నిమిషాల 56 సెకండ్ల లో 50 ప్రశ్నలకి 50 సరైన జవాబులు ఇవ్వడం జరిగింది అని వివరించారు. అబాకస్ భోధించిన సింధూ.రవళి టీచర్స్ ని అభినందించారు.

# స్థానిక ఎన్నికల్లో బీసీ జెండా ఎగరేద్దాం

### జనరల్ సీట్లలో బీసీ అభ్యర్థులను బరిలో దించుతాం

### బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



మహబూబ్ నగర్ (భూత్పూర్),మార్చి4(ప్రభాత ఉదయం) త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ జెండా ఎగరేయాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ పిలుపునిచ్చారు.మంగళవారం భూత్పూర్ మండలం, అన్నాసాగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సమగ్ర కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా కల్పించేందుకు ముఖ్యమంత్రి గారు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. కోరారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జనరల్ సీట్లలో బీసీ అభ్యర్థులను బరిలో దించుతామని, బీసీ పొలిటికల్ జెఏసి తరఫున వారికి సహాయ సహకారాలు అందించడంతో పాటు వారిని గెలిపించుకునే బాధ్యత కూడా మేమే తీసుకుంటామన్నారు.బీసీలు పార్టీల వారీగా విడిపోకూడదని, ఖచ్చితంగా గెలిచేలా వ్యూహాత్మక ఎత్తుగడలు ఫాలో కావాలని వివరించారు.ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీసీల మధ్య చిచ్చు పెట్టేందుకు కొందరు అగ్రకుల నాయకులు కుట్రలు చేస్తుంటారని, వీటిపై అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. రాజ్యాధికారానికి మూలం స్థానిక సంస్థలని, వాటిని చేజిక్కించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.బీసీలు ఏకమై బీసీ అభ్యర్థులు గెలిచేందుకు బీసీ కులాల ఐక్యం కావాలని కోరారు. ప్రజల కోసం పనిచేసే వారిని ప్రజలే గెలిపిస్తారని, ప్రజల సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల కోసం పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి వజగౌని వెంకటన్న, మండల అధ్యక్షుడు కరెంట్ నరసింహ, మూసాపేట మండల అధ్యక్షుడు తిరుపతయ్య గౌడ్, కొత్తకోట మండల అధ్యక్షులు అంజన్న యాదవ్, వనపర్తి జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, వనపర్తి పట్టణ అధ్యక్షులు దేవర శివ,వెంకట్రాములు, తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రక కట్టడాలను పునరుద్ధరించి, సుందరీకరణకు చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ సంతోష్





చారిత్రాత్మక లింగం బావిని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల, జిల్లా ప్రతినిధి,ఫైబ్రవ్ (గద్వాల్ కోట) లింగంబావి స్టెప్‌వెల్‌ను పునరుద్ధరించి, సుందరీకరణకు చర్యలు చేపట్టి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గద్వాల్ కోట,లింగంబావి స్టెప్‌వెల్ ను అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చారిత్రక కట్టడాలను పునరుద్ధరించి భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గద్వాల్ కోటను పర్యాటక ఆకర్షణగా అభివృద్ధి చేయడానికి అవసరమైన మరమ్మతులు,శుభ్రత చర్యలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. గద్వాల్ కోట, లింగం బావి స్టెప్‌వెల్ పునరుద్ధరణ కోసం సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక, (%ణూ=%) తయారుచేయాలని ఆర్కిటెక్ట్‌ను ఆదేశించారు. కట్టడాన్ని స్థిరంగా నిలిపేందుకు సరైన నిర్మాణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. లింగంబావి స్టెప్‌వెల్ పునరుద్ధరణలో భాగంగా ప్రదేశం ఆకర్షణీయంగా మారేందుకు ల్యాండ్‌స్కేపింగ్ పనులు చేపట్టాలని సూచించారు. రైలింగ్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి భద్రతను పెంచాలని, అలాగే రోజువారీ శుభ్రత, నీటి పరిశుభ్రత కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ చర్యలు పురాతన నీటి నిల్వ వ్యవస్థను రక్షించడంతో పాటు,శుభ్రతను పెంచి మంచి పర్యావరణాన్ని అందిస్తాయని అన్నారు. ఈ పునరుద్ధరణ పనులు ప్రాంతీయ వారసత్వ సంరక్షణ,నీటి వనరుల మెరుగుదల, పర్యాటక అభివృద్ధికి దోహదం చేస్తాయని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, ఆర్కిటెక్ శ్రీ లేక, వర్డ్ ఆఫీసర్స్ ,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీజమ్ములమ్మ ఆలయం వద్ద నిలువు దోపిడీ



### ఇష్టానురీతిగా వసూళ్లు

### టెన్ కొడితేనే.. టెంకాయ కొట్టేది

### భక్తులపై అధిక ధరల పోటు

గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి 4(ప్రభాత ఉదయం)నడిగడ్డ ఇలవేల్పు శ్రీ జమ్ములమ్మ అమ్మ వారి సాక్షిగా గుత్తేదారులు భక్తులను నిలువు దోపిడీకి గురి చేస్తున్నారు. దేవుని దర్శనానికి వెళ్లే ప్రతి భక్తుడు కొబ్బరికాయ కొట్టడం సర్వసాధారణం. అది ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా భావిస్తారు. తమ ఇలవేల్పుకు మొక్కు చెల్లించుకునే ప్రధాన కార్యమిది. దీన్ని సైతం అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. నడిగడ్డ ఇలవేల్పు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న గద్వాలలోని శ్రీజమ్ములమ్మ, పరుశరామ స్వామి ఆలయం వద్ద భక్తుల నిలువు దోపిడి మరింత పెరిగిపోయింది. సాధారణంగా ప్రతి మంగళ, శుక్రవారాలలో శ్రీజమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి ఉమ్మడి పాలమూరు జిల్లా నుండే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అమ్మవారికి స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు చెల్లించుకుంటారు. కాని ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయల విక్రయంలో అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఆలయ నిబంధనల్ని తుంగలో తొక్కి గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దోపిడిని నియంత్రించాల్సిన ఆలయ వర్గాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు అక్రమానికే పరోక్షంగా మద్దతు పలుకుతున్నారు. ఆలయ అధికారులు స్పందించి దేవాలయానికి వచ్చే ఆదాయాని దోపిడికాకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

#### టెన్ కొడితేనే.. టెంకాయ కొట్టేది

శ్రీజమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులు అమ్మవారిని దర్శించుకున్న తర్వాత మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఎక్కువ మంది కొబ్బరికాయలను కొడుతుంటారు. ఇప్పుడు కొబ్బరికాయలు కొన్నా, కొట్టినా డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొబ్బరికాయలు కొట్టే స్థలంలో కొంత మంది ప్రైవేటు వ్యక్తులు భక్తుల చేతిలో నుంచి బలవంతంగా కొబ్బరికాయలను లాక్కుంటున్నారు. భక్తులు కొట్టాల్సిన కాయలను వారే కొడుతున్నారు. ఇలా చేసినందుకు రూ.10నుంచి రూ.20 వసూలు చేసి జేబుల్లో వేసుకుంటున్నారు.

#### అమ్మ వారి దర్శనానికి గంటలకొద్దీ నిరీక్షణ

అయిన వారికి ఆకుల్లో.. కాని వారికి కంచాల్లో అన్న సామెత శ్రీజమ్ములమ్మ ఆలయ పూజారులకు, అధికారులకు సరిగ్గా అతికినట్లు సరిపోతుంది. తమకు నచ్చిన వారు.. కాసులు ఇచ్చే వారికి పెద్దపీట వేస్తూ.. సామాన్య భక్తులకు చుక్కలు చూపిస్తున్నారనే విమర్శలను వారు మూటగట్టుకుంటున్నారు. ఆలయ పూజారులు తమకు ఇష్టం వచ్చిన రీతిలో వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



శంషాబాద్‌లో నిర్వహించిన రంజాన్ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

# ఘనంగా ఇఫ్తార్ విందు

శంషాబాద్, మార్చ్ 4(ప్రభాత ఉదయం) శంషాబాద్ మున్సిపాలిటీలో మాజీ ఉపసర్పంచ్ షంషుద్దీన్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ.ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు . ఈ కార్యక్రమంలో నార్సింగ్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ దూడల వెంకటేష్ గౌడ్. సంజయ్ యాదవ్. మహేందర్ రెడ్డి సురేష్ గౌడ్. మాజీ ,కౌన్సిలర్ జంగీర్ ఖాన్. రఫిక్. ,కుమార్ ,అజయ్. అస్లాం ఖాద్రి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నేడు మహిళా దినోత్సవ వేడుకలు

### సుష్మా మహేందర్ రెడ్డి



శంషాబాద్,మార్చ్ 4 (ప్రభాత ఉదయం ) మహిళా దినోత్సవ వేడుకలను బుధవారం శంషాబాద్ పట్టణంలోని వై ఎన్ ఆర్ గార్డెన్ లో నిర్వహిస్తున్నట్లు సిరి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ కొలను సుష్మా మహేందర్ రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పట్టణంలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆమె వివరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని సుష్మ మహేందర్ రెడ్డి కోరారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608